www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 3 ఏప్రిల్ 2024
5
చిత్తూరు

జిల్లా ఎస్పీ బదిలీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా ఎస్పీ జాషువాను బదిలీ చేస్తున్నట్లు ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఎస్పీగా ఉన్న రిశాంత్ రెడ్డి బదిలీ కావడంతో ఆస్థానంలో జాషువా జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. అయితే ఎన్నికల నేపథ్యంలో ఆయన్ను కూడా బదిలీ చేస్తున్నట్లు ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది.

పెన్షన్ టెన్షన్...

నేటి నుంచి పంపిణీ....



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సామాజిక పింఛన్లు ఎన్నికలవేల వేడి రాజేస్తున్నాయి.. ఓ వైపు ప్రతిపక్ష టిడిపి పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకుంటోందని అధికారపార్టీ ఆరోపిస్తుంటే.. మరోవైపు డబ్బులు దారిమళ్లించడం వల్ల ఖజానా ఖాళీ అయ్యి పింఛన్ల పంపిణీ ఆలస్యమౌతోందని, ఇది అధికారపార్టీ తప్పే అని టిడిపి అంటోంది.. ఎన్నికల సమయంలో సామాజిక పింఛన్ల పంపిణీ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్దచిచ్చునే రాజేసింది.

ఇదిలా ఉండగా ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు తీసుకునే అవ్వాతాలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అసలు ఈనెల పింఛన్ వస్తుందా లేదా అని టెన్షన్ మొదలైంది. వైసిపి ఏర్పాటు చేసిన వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తూ అధికారపార్టీ వారికే ఓటు వేసేలా ప్రచారం నిర్వహించడంతో పాటు పింఛన్లు రావడానికి జగనన్న ముఖ్యకారణమని రెండోసారి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకుంటే వారికి పింఛన్లు అందే పరిస్థితు ఉండదంటూ ప్రచారం చేస్తోందని అనుమానాలతో తెలుగుదేశం పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో పింఛన్ల పంపిణీ ఆలస్యమౌతోంది.

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సామాజిక పింఛన్లు 2,74,000లు వున్నాయి. ప్రతి నెలా 612 గ్రామ, వార్డు సచివాల సిబ్బంది 8,800 మంది ప్రతి ఇంటికీ వెళ్ళి పింఛన్లు అందస్తున్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పింఛన్ల పంపిణీలో నెలకొన్న సమస్యలను తొలగిస్తూ ఈనెల 3వ తేదీ నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం పూనుకుంటోంది. నేటి నుంచి జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయల్లో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ పంపిణీలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించేలా జిల్లా కేంద్రంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామ, సచివాలయ కార్యదర్శులు వారి పరిధిలోని ఫించన్లు పంపిణీ కోసం నగదు బ్యాంకు నుండీ డ్రా చేయాల్సి ఉంటుంది. గ్రామ, వార్డు సచివాయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి ఫించన్ పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ బుధవారం నుండీ ఈనెల 6వ తేదిలోపు పూర్తి చేయాలి. ఆ తరువాత సచివాలయాల వద్దకు రాలేని ఫించనుదార్లకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయనున్నారు. ఆధార్ కార్డు, పింఛన్ కార్డు, ఓటిపిల ద్వారా పంపిణీ చేయాల్సి ఉంటుంది. సాయంత్రానికి కళ్లా మిగిలిన నగదు ఇతర వివరాలను సచివాలయ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో ఎంపీడీవోలకు



జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు: కలెక్టర్

జిల్లాలో ఈనెల 3వ తేదీ నుండి గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలో సామాజిక పెన్షన్‌ల పంపిణీపై ఎంపిడిఓలు, తహశీల్దార్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ చేయాలని, నగదు డ్రా చేసేందుకు సచివాలయ కార్యదర్శులకు అనుమతి ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ డిఆర్‌ఓ, డిఆర్డిఎ పిడి, మెప్మా పీడీ, డిపిఓ, డిఎల్‌డిఓల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. పింఛన్ల కోసం సచివాలయాలకు రాలేని వారికి 6వ తేదీ ఇంటి వద్దనే పంపిణీ చేయాలని, మొత్తం ఈ కార్యక్రమం జిల్లాలో నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బంది రాకుండా కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ ఉంటుందని ఏదైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ ద్వారా పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. డిఆర్‌ఓ పుల్లయ్య, డిఆర్‌డిఎ పిడి తులసి, డిపిఓ లక్ష్మి, డిఎల్‌డివో రవికుమార్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

రాజకీయాలు పక్కన పెట్టి.. పించన్లు అందించండి

టిడిపి వినతులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాజకీయాలను పక్కనపెట్టి వృద్ధులు, వితంతువులు, వికలాంగులను ఆదుకునేందుకు తక్షణం వారికి పింఛన్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్, టిడిపి నగర పార్టీ అధ్యక్షురాలు కటారి హేమలత, జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ మంగళవారం కమిషనర్ అరుణకు వినతిపత్రం అందించారు.

వికోట: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వైసిపి ప్రభుత్వం రాజకీయం చేస్తూ టిడిపిపై బురద చల్లడం సమంజసం కాదని తెలుగుదేశం పార్టీ నేతలు మండిపడ్డారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందువలన ఎలక్షన్ కమిషన్ వాలంటరీ వ్యవస్థను ఎన్నికల విధుల్లోకి హాజరు కాకూడదని, పెన్షన్లు పంపిణీ చేయకూడదని ఆదేశిస్తే అది టిడిపికి ఆపాదించడం అవివేకమని అన్నారు. వాలంటీర్లు కాకపోయినా సచివాలయ ఉద్యోగుల చేత పెన్షన్ కార్యక్రమాన్ని అమలు చేయాలని ఎంపీడీవో గోవర్ధన్‌కు టిడిపి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. మండల టిడిపి అధ్యక్షులు రంగనాథ్, రామచంద్ర నాయుడు, చౌడప్ప, రాంబాబు, ఈశ్వర్ గౌడ్, ధీరజ్, అయ్యాజ్ బాష, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఇండ్ల వద్దకే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో శివశంకర్ పింఛన్ల పంపిణీ ఇండ్ల వద్ద చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. బీసీ నాయకులు నాగరాజు గౌడ్, మాధవ గౌడ్, దేవవాని, రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వాలంటీర్లను తప్పించి సచివాలయ సిబ్బందిలతో పింఛన్ల పంపిణీ చేయాలని కోరుతూ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు చిరంజీవి బిజెపి కన్వీనర్ రాజేంద్రన్, అధ్యక్షుడు జల్లా జ్యోతిరెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో ఏవో కృష్ణయ్యకి వినతి పత్రం అందించారు.

గంగాధర నెల్లూరు: సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేయాలని,టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో ఎంపీడీవో భాస్కర్‌కు టిడిపి, జనసేన నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కృష్ణమనాయుడు, శ్రీధర్ యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్ల పంపిణీలో చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు మండల కార్యాలయం వద్ద ఎంపీడీవో ఈశ్వరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆనంద రెడ్డి, మనస్వామి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, పత్రా నారాయణ, రామమూర్తి పాల్గొన్నారు.

జగన్ మావయ్యా...

సభకు బస్సులు.. బడికి మేమెలా..?

- 56 బస్సులకు గాను 40 తరలింపు
- అవస్థలు పడ్డ విద్యార్థులు, ప్రయాణికులు
- బస్సు కోసం గంటల తరబడి ఎండలోనే ఎదురుచూపు

ప్రజాశక్తి- పలమనేరు :

బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

పలమనేరు పట్టణంలోని ఆర్టీసీ డిపోకు చెందిన 40 బస్సులను మదనపల్లెలో జరిగే జగన్ మోహన్ రెడ్డి మేము సిద్ధం సభకు తరలించారు. దీంతో రోజూ ఉదయాన్నే బడులు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. డిపోలో మొత్తం 56 బస్సులు ఉండగా సభకు 40 బస్సులను వైసిపి నాయకులు బుక్ చేసుకుని పలమనేరు నుంచి కార్యకర్తలను మదనపల్లెకు తరలించారు. దీంతో మిగిలిన 16 బస్సుల్లోనే విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు సమయానికి బడులకు, కాలేజీలకు వెళ్లలేక ఎండలోనే ఎదురుచూస్తూ ఉండిపోయారు. ఇలా సభలకు ఆర్టీసీ బస్సులను పంపేటప్పుడు విద్యార్థులకు సెలవు ఇవ్వొచ్చుకదా అంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సులో కార్యకర్తల తరలింపు..

ప్రజాశక్తి- సదుం: సిఎం జగన్‌మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా మంగళవారం రాత్రి సదుం మండలంలోని అమ్మగారిపల్లి గ్రామంకు చేరుకుని బస చేయనున్నారు. దీంతో వైసిపి నాయకులు ఘనంగా ఏర్పాట్లు చేయడంతో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా మదనపల్లిలో సిఎం సభను విజయవంతం చేయడానికి సింగిల్‌విండో ఛైర్మన్ సిఎం తిమ్మారెడ్డి, వైస్‌ఛైర్మన్ పెద్దిరెడ్డి రమేష్ రెడ్డి, తిమ్మానాయునిపల్లి సర్పంచ్ లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో సదుం నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉదయం వైసిపి నాయకులు, కార్యకర్తలను తరలించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా బస్సు యాత్రకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. ట్రాఫిక్‌ను సోమల నుంచి నంజంపేట మీదుగా మళ్లించారు. అలాగే చీకలచేను మీదుగా కల్లూరు వైపు, తిరుపతి నుండీ సదుంకు, సదుం నుండీ కందూరు రోడ్డు మీదుగా మదనపల్లి వైపు బస్సులను మళ్లించినట్లు ఎస్.ఐ మారుతి తెలిపారు.

సదుం నుంచి ఆర్టీసీ బస్సుల్లో సభకు తరలివెళుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ఆక్ర(మణలు)ందనలు

- ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా...
- శ్మశానం, బావులు, కాలువ ఏదైనా..
- అడ్డుకున్న గ్రామస్తులపై దాడి
- నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు

తాగునీటికి ఉపయోగిస్తున్న బావి

ప్రజాశక్తి- గంగవరం

భూకబ్జాదారులకు ఆక్రమణలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. ఆఖరికి ప్రభుత్వభూములు, తాగునీటి బావులు, కాలువలే కాదు.. శ్మశానాలనూ కబ్జాచేసి దోచేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు. అధికారులతోడు, అధికారపార్టీ అండదండలు యథేచ్ఛగా కన్నుపడిన చోటంతా వారిదైపోతోంది..

కబ్జాకు గురైన శ్మశానంను చూపుతున్న గ్రామస్తులు

మండలంలోని గంట్రాజుపల్లి పంచాయతీ నల్లతుమ్మనపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 339,6లో 66 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఇందులోనే గ్రామ చెరువు నుంచి పంటపొలాలకు నీరు వచ్చే రాజకాలువ, శ్మశానం, తాగునీటి కోసం తవ్విన బావి ఉన్నాయి. కొందరు ఆక్రమణదారులు అధికార పార్టీ అండదండలు, అధికారుల సపోర్టుతో శ్మశాన స్థలాన్ని సైతం చదును చేసి ఆ భూమి తమదంటూ తిష్ట వేశారు. ఇదేమి అన్యాయం అంటూ ప్రశ్నించిన గ్రామస్తులపై దాడులకు తెగబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

కోట్లు విలువ చేసే భూమి...

ఆక్రమణకు గురైన సదరు ప్రభుత్వ స్థలం చెన్నై-బెంగళూరు రహదారికి దగ్గరగా ఉండటమే కాక సమీపంలోనే పరిశ్రమలు ఉండటంతో కోట్లు విలువ చేస్తుంది. దీంతో కొందరు వ్యక్తులు అధికారులతో కుమ్మకై ప్రభుత్వ భూములను గుర్తించి రాత్రికిరాత్రే చదును చేసి ఆ స్థలం తమదంటూ బోర్డులు నాటి లక్షల్లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామస్తులు తమ పొలాలకు సాగునీరు వచ్చే కాలువ, తాగునీటి బావి, శ్మశానాన్ని కూడా కబ్జా చేయడంతో అధికారులకు విన్నవించుకున్నా సంబంధిత శాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. ఈ సమస్యపై ఆరునెలల క్రితం తహశీల్దార్, ఆర్‌డిఓకి అర్జీ సమర్పించినా, ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానాన్ని చదును చేసిన ఆక్రమణదారులు ఇప్పుడు తాగునీటి బావిని పూడ్చే పనిలో ఉన్నారని, అడ్డుకున్న గ్రామస్తులపై దాడి చేశారని, వేసవి నేపథ్యంలో తమకు నీటి కష్టాలు తప్పవంటూ గ్రామ ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడటంతోపాటు తమకు సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని, కబ్జాకు గురైన శ్మశాన స్థలం గ్రామానికి కేటాయించాలని కోరుతున్నారు.

ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- న్యూస్ ఛానల్స్‌లో వచ్చే

రాజకీయ ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ఎంసీఎంసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వివిధ టీవీ ఛానల్స్‌లో రాజకీయ పార్టీలకు సంబంధించి ప్రకటనలు, సమావేశాలు, ర్యాలీలను క్షుణంగా పరిశీలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ లోని స్పందన హాల్ నందు ఏర్పాటు చేసిన యం సి య సి కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అప్పటి నుంచి చిత్తూరు జిల్లాకు సంబంధించి వివిధ రకాల టీవీ ఛానల్స్‌లో ప్రసారమయ్యే ప్రకటనల నిమిత్తం ముందస్తుగా ఎంసిఎంసి కమిటీ ఆమోదం పొందాలని, పెయిడ్ న్యూస్‌కు సంబంధించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రచారాలు, ప్రకటనలు నిమిత్తం నిర్ణిత ఫార్మట్‌లో తేదీ, సమయం, ఏ ఛానల్, ఏ పార్టీ వంటి వివరాలను తయారు చేసి యంసియంసి కమిటీ నోడల్ అధికారికి అందజేయాలన్నారు. కమిటీ పరిశీలించి అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు పెయిడ్ న్యూస్‌ని సంబంధిత పార్టీల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. నోటిఫికేషన్ వచ్చినా అనంతరం అభ్యర్థుల ఖాతాలకు జమ చేయాలని నోడల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కమిటీ నోడల్ అధికారి బి.నాగేశ్వర రావు, సమాచార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపోలో విద్యార్థుల అరుదైన ఘనత

- ఆస్ట్రేలియాలో ప్రాజెక్టు చేయడానికి ఒప్పందం

అపోలో విద్యార్థులతో ఆస్ట్రేలియా చెందిన మొనాష్ యూనివర్సిటీ ప్రొఫెసర్ క్రిస్ బైన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు అపోలో యూనివర్సిటీ విద్యార్థులు అరుదైన ఘనత సాధించారు. ఆస్ట్రేలి యాలో ప్రత్యేక ప్రాజెక్టు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆస్ట్రేలియాలో ప్రసిద్ధి చెందిన మొనాష్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ క్రిస్ బైన్ సోమ, మంగళ వారాల్లో చిత్తూరులోని అపోలో యూనివర్సిటీని సందర్శించారు. వర్సిటీ హెల్త్ ఇన్ఫర్మాటిక్స్ విద్యార్థులైన హేమంగి సవాన్, ప్రజ్ఞ వర్మ, సందీప్‌లకు ప్రొఫెసర్ క్రిస్ బైన్, మొనాష్ యూనివర్సిటీలో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్‌లలో ప్రోజెక్టుల చేయడానికి సమ్మతి పత్రాలను అందచేశారు. రకరకాల జబ్బుల కారణాలను సులువైన పద్ధతిలో కనిగొని మరింత వేగంగా చికిత్స అందించటం ఈ ప్రోజెక్టుల ముఖ్య ఉద్దేశ్యంగా చెప్పారు. కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వినోద్ భట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పోతరాజు, అపోలో నాలెడ్జ్ సిటీ ప్రధాన అధికారి నరేష్ రెడ్డి, ప్రొఫెసర్ సత్యనారాయణ విద్యార్థులను అభినందించారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారత ఎన్నికల సంఘం- 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నిర్దేశకాలను జారీ చేయడం జరిగిందని, వీటిని అభ్యర్థులు, అధికారులు తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్, చిత్తూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి పి. శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ సమావేశపు మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింటింగ్ ప్రెస్‌వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. జేసి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రచారాలు నిర్వహించుకోవచ్చునని, నోటిఫికేషన్ విడుదల అయిన తర్వాత ప్రచార ఖర్చులు అభ్యర్థి ఖర్చులుగా భావించడం జరుగుతుందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో అధికారులు కచ్చితంగా వ్యవహరించడం జరుగుతుందని, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులు ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకొని పొందవచ్చు అని, అనుమతులు లేకుండా ఎటువంటి ప్రచారాలు నిర్వహించకూడదని అన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అసెంబ్లీ అభ్యర్థికి

ప్రచార అనుమతులు తప్పనిసరి : జెసి

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

రూ.40 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని, ఎన్నికలకు సంబంధించిన చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు పరిశీలకులు రానున్నారని, ఎన్నికల ప్రచారం ఇతరత్రా వ్యవహారాలకు సంబంధించి వారు ఎప్పుడైనా ఎక్కడైనా పర్యటించే అవకాశం ఉందన్నారు. ఏవైనా సమస్యలు, సందేహాలు ఉన్నట్లయితే అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆర్‌ఓతో పాటు నలుగురు ఏఆర్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు వివిధ బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని వారికి సహకరించాలని కోరారు. ఏఆర్వోలు అరుణ, శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి లోకేష్, బీఎస్పీ ప్రతినిధి భాస్కర్, టిడిపి ప్రతినిధులు రాజసింహులు, జగన్మోహన్, రాజశేఖర్, వైయస్సార్సీపి ప్రతినిధులు విజయానంద రెడ్డి, ప్రతాప్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

పలమనేరు కాంగ్రెస్ అభ్యర్థిగా

బివిఎం శివశంకర్

ప్రజాశక్తి- పలమనేరు

పలమనేరు కాంగ్రెస్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా గంగవరం మండలం నల్లగుట్లపల్లికి చెందిన బివిఎం శివశంకర్ పేరును ఖరారు చేశారు. మంగళవారం ఇడుపులపాయలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో జరిగిన అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు విడుదలలో పలమనేరు కాంగ్రెస్ అభ్యర్థిగా బిఎం శివశంకర్ పేరును ప్రకటించారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రం ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ సభ్యులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రెడ్ క్రాస్ మండల ఛైర్మన్ పాపిరెడ్డి చేతుల మీదుగా వైద్యుల సమక్షంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్, డాక్టర్లు దుర్గాదేవి, ప్రణీత్, రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి మహాదేవ నాయుడు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయండి: తహశీల్దార్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందిని తహశీల్దార్ రవి, ఎంపీడీవో భాస్కర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులుశెట్టి, ఈవోపీఆర్‌డీ రాఘవేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ గర్జన సమావేశాలను జయప్రదం చేయండి: మాజీ ఎమ్మెల్సీ

సమావేశంలో మాట్లాడుతున్న గౌనివాని శ్రీనివాసులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని విజలాపురం, రామకుప్పంలో నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సమావేశాలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు ఆనందరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రామకుప్పంలో శ్రేణులతో ముందస్తు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 5, 7న సమావేశాలు జరగనున్నట్లు చెప్పారు. గడిచిన ఐదేళ్లలో బీసీలకు చేసిన అన్యాయాలను వివరిస్తామన్నారు. టిడిపి పొందుపరిచిన బీసీ డిక్లరేషన్ అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. బీసీ కులాలకు చెందిన నేతలు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మన స్వామి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, గంట్లప్ప గౌడు, రామ్మూర్తి, నారాయణ చారి, టీవీ రవి, విజయ్‌కుమార్ రెడ్డి, బాలరాజు, సుబ్రి, మంజునాథ్, వెంకటరమణ పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆదరించండి: థామస్

ఇంటింటి ప్రచారంలో డాక్టర్ థామస్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: జీడీ నెల్లూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని, ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇచ్చి ఆదరించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం కార్వేటినగరం మండలంలోని టికెఎం పేట పంచాయతీలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొన్నా యుగంధర్‌తో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ముందుగా పార్టీ శ్రేణుల నుంచి ఆయనకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో నాయకులు చెంగల్‌రాయల్ యాదవ్, జయశంకర్ నాయుడు, లోకనాథరెడ్డి, కెఎం. రవి, జనార్దన్ రాజు, నాగేశ్వరరాజు, రవి యాదవ్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు, వస్తు తరలింపుపై పటిష్ట నిఘా: శ్రీధర్

వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, వస్తు తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాలేరు ఫ్లైఓవర్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, వస్తువులు, మద్యం తరలింపుపై పూర్తి స్థాయిలో సోదాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కానిస్టబుల్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి తప్పదు ఓటమి: సెల్వమణి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: కూటమికి ఓటమి తప్పదని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సెల్వమణి అన్నారు. మంగళవారం నగరి మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడలో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చేసిన అభివృద్ధిని ప్రత్యక్షంగా చూపే కరపత్రాలను అందించారు. తమది ఉత్తుత్తి హామీలు ఇచ్చే బూటకపు ప్రభుత్వం కాదని చెప్పిన మాటపై నిలబడే ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ ఛైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, మురుగ, ఇంద్రయ్య, అయ్యప్ప, మేషాక్, దినకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు చేయాలి: డాక్టర్ రవిరాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గర్భిణులకు విధిగా రక్త పరీక్షలు చేయాలని ఇన్‌ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో ప్రతి నెలా జరిగే ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గర్భిణీలకు రక్త పరీక్షలు శాలిస్ పద్ధతిలో కచ్చితత్వంతో చేయాలన్నారు. తద్వారా రక్తహీనత ఉన్న గర్భిణీ స్త్రీలకు వెంటనే జాగ్రత్తలు తీసుకొని మాత శిశు సంరక్షణకు తోడ్పడవచ్చునని తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్ఒ డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు తప్పనిసరిగా ప్రతి వారం గల్ల పరీక్ష చేసి రిపోర్టులు పంపాలన్నారు. రెండు వారాలు మించి ఉన్న దగ్గు కేసులకు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా గల్ల పరీక్షించి పాజిటివ్ అయినట్లయితే ఆరు నెలల పాటు మందులు ఇవ్వాలన్నారు. అలాగే కుష్ఠు అవగాహన కార్యక్రమాలు స్పర్శ లేని మచ్చులు ఎవరికి ఉన్న వైద్యాధికారి దగ్గర నిర్ధారణ చేయించి ఉచిత మందులు పంపిణీ చేయాలని సూచించారు. మలేరియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ అపరిశుభ్రతతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున ఇళ్ల పరిసరాల్లో నీరు నిలవలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని తెలుపాలన్నారు. ఫ్రైడే డ్రైడే తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు రామకష్ణ, శివ సుబ్రహ్మణ్యం, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి..

హైరిస్క్ గర్భిణీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిరాజు సూచించారు. మంగళవారం చిత్తూరు అర్బన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రతి నెలా జరిగే ఆశాడే సమావేశంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. మాత శిశుమరణాల నివారణకే వివిధ రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డెమో జయరాముడు, శ్రీవాణీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: తీర్థం, బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అధ్యక్షతన ఆశా డే సందర్భంగా ఆశాలకు సమావేశం నిర్వహించారు. గర్భవతుల నమోదు, వైద్య పరీక్షలు, పోషకా హారము, ప్రమాదకర లక్షణములు ఉన్న గర్భవ తుల యొక్క సంరక్షణ, ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు తదితర అంశాలపై చర్చించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మిశ

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు జి లక్ష్మి శ మంగళవారం పరిశీలించారు. బిఎల్వోలు ఈవిఎం ఉపయోగించడంపై, వారి విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు 2024 షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు జి లక్ష్మిశ తనిఖీ చేశారు. ఈ దఫా సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పూర్తి స్థాయి ప్రణాళికలతో ఈఆర్ఓ, ఎఈఆర్ఓలు, సెక్టోరల్ అధికారులు, పోలీస్ అధికారులు సమన్వయంతో అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిఎల్వోలు వారి విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి వుండాలని పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని చంద్రగిరి మండలం ఎ రంగంపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన నాలుగు 111,112,113, 114 నెంబర్లు గల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తొండవాడ గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 130, 131 పోలింగ్ కేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రంలోని 132వ నెంబరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ కేంద్రం నుండి 100 మీటర్ల రేడియస్ పరిధిలో మార్కింగ్‌ను చెక్ చేసి రెడ్ కలర్ లో 100 మీటర్లు అనే వివరాన్ని ప్రస్ఫుటంగా కనిపించేలా రాయాలని సూచించారు. తిరుపతి రూరల్ పరిధిలోని తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 20 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి ర్యాంపు సక్రమంగా ఏర్పాటు ఉండాలని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ర్యాంపు, తాగు నీరు, మరుగుదొడ్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ లొకేషన్‌లో బయట, అందులో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రస్ఫుటంగా కనిపించేలా రాయించాలని ఈఆర్ఓ, ఎఆర్ఓ లను ఆదేశించారు. బిఎల్వోలు వారి విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్ పోల్ నిర్వహణ, పోలింగ్‌కు వచ్చే సిబ్బందికి ఏర్పాట్లు, ఈవిఎం ఆపరేషన్ పై, పోలింగ్ ముందు రోజు పోలింగ్ రోజు వారి విధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బిఎల్వో లను వారి ఎన్నికల విధులపై పలు ప్రశ్నలు అడిగి వారికి విధులపై అవగాహన కల్పించారు. జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా ఎన్నికల ప్రశాంత నిర్వహణకు చర్యలు చేపడుతామని అధికారులు అందరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, తహశీల్దార్ మారుతి, మహబూబ్ చాంద్, సెక్టార్ అధికారులు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

రూ.13 వేల కోట్లు ఏమయ్యాయి జగన్?

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ఖజానాను పతనం చేయడమే ఏకైక లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ ఎన్నికల కోడ్ అమలులోకి రాబోతున్న కొద్ది రోజుల ముందు సుమారు రూ.13 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి మళ్లించారో చెప్పాలని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టరు ఎం ఉమేష్ రావు డిమాండు చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి పెన్షన్లు ఆపిందని ప్రచారం చేస్తూ జగన్ తన రాజకీయ లబ్ధి కోసం 15 రోజుల్లో రూ.13 వేల కోట్ల రూపాయలు తన కాంట్రాక్టర్లకు మళ్లించి ఖజానా ఖాళీ చేసి వృద్ధులను, వితంతువులను, వికలాంగులను మోసం చేశాడని ఉమేష్ ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిసినా ప్రభుత్వ ఖజానాలో పెన్షన్ డబ్బులు ఉంచకుండా జగన్‌మోహన్ రెడ్డి తన బినామీలకు ఇష్టారాజ్యంగా పంచిపెట్టడం దుర్మార్గమని సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి ఆరోపించారు. 'ఆర్‌బిఐ దగ్గర జగన్‌కి ఇప్పుడు అప్పు పుడితే తప్ప పెన్షన్లు ఇవ్వలేని దుస్థితికి ఆంధ్రప్రదేశ్‌ను దిగజార్చడానికి జగన్‌మోహన్ రెడ్డి కారణం కాదా ?' అని వారు ప్రశ్నించారు.

మాదిగలకు టిడిపి సీట్లు కేటాయించాలి: ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి టిడిపి సీటు కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఎన్నికల సమయంలో మాదిగలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారు తప్ప మాదిగలకు పోటీ చేసే అవకాశం ఇవ్వడం లేదని నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ ఆదురు రత్నం పేర్కొన్నారు. గూడూరు హెడ్ పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం వద్ద నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదురు రత్నం మాట్లాడుతూ సింగనమల నియోజక వర్గం నుండి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇచ్చారని, టిడిపి కూడా మాదిగలకు సీట్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ తిరుపతి అధ్యక్షులు గోవిందు శంకరయ్య, నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఆదూరు దామోదర్, రమణారావు, సునీత, ఏడుకొండలు, పృథ్వి, సుందరం, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల పుస్తక దినోత్సవం

ప్రజాశక్తి- కెవిబి పురం: ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో కెవిబిపురం మండలం శ్రీనివాసపురం ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లల్లో పఠనాసక్తి పెంచడానికి పాఠశాలల్లో మినీ గ్రంథాలయం ఏర్పాటు చేసి వారి వద్ద పుస్తకాలు చదివించడం అలవాటు చేశా మన్నారు. పుస్తక పఠనం వల్ల బాలల్లో విజ్ఞానం పెంపొందుతుందని, చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మావుళ్లయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞానం పెంచుకోవడానికి గ్రంథాలయం ఎంతో ఉపయో గపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు అందించి చదివించారు. క్రమం తప్పకుండా పుస్తకాలు చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజా ప్రగతి ట్రస్ట్ సిబ్బంది వేణుగోపాల్, ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్ : వైసిపి విద్యార్థి విభాగం నాయకులు వి హరిప్రసాద్ రెడ్డి మంగళవారం మదనపల్లిలో బస్సు యాత్రలో వున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎన్నో సేవలందించారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పాఠశాలలను పునరుద్ధరించడంతో పాటు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టి పేద పిల్లలకు మంచి భవిష్యత్తు అందించారన్నారు. మళ్లీ జగన్ విజయానికి కృషి చేస్తే విద్యార్థులు, నిరుద్యోగులకు గొప్ప పథకాలు తీసుకొస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థి సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు రేణిగుంటకు జగన్ బస్‌యాత్ర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈనెల 4వ తేదీన రేణిగుంట నుండి జగన్ బస్సు యాత్ర శ్రీకాళహస్తి మీదుగా నాయుడుపేటకు చేరుకుంటుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఎం జగన్ బస్సు యాత్ర గురువారం ఉదయం 9 గంటలకు రేణిగుంట, గురవరాజు పల్లి వద్ద ఉన్న ఎఫ్‌సిఐ గొడౌన్ నుండి ప్రారంభం అవుతుందని, అనంతరం భారీ బైక్ ర్యాలీ మధ్య ఏపీ సీడ్స్ కూడలికి చేరుకుంటుందన్నారు. అనంతరం తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం వద్ద లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో జరిగే సమావేశంలో జగన్ పాల్గొంటారని తెలిపారు. బస్సు యాత్ర ప్రారంభం మొదలు వీడ్కోలు పలికే వరకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మిద్దెల హరి, లోకేష్ యాదవ్, గోరా, పఠాన్ ఫరీద్, పసల సుమతి పాల్గొన్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కెవిబిపురం: కెవిబిపురం మండల కేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆ బ్యాంకు మేనేజర్ సాయి తెలిపారు. బ్యాంకు సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ప్రతి గడపకూ వెళ్లి బ్యాంకు అందించే సేవలను కరపత్రాల ద్వారా మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బ్యాంకు ఖాతాదారులకు ఏటీఎం, ఫోన్‌పే సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని, ఇక నుంచి సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు ఏటీఎం, ఫోన్‌పే సౌకర్యాలు అందిస్తున్నామని ప్రతి వినియోగదారుడూ ఈ సేవలను వినియోగించుకుని సులభంగా నగదు లావాదేవీలు చేసుకోవచ్చని తెలిపారు. బంగారుపై రుణాలు, పర్సనల్ లోన్స్ ఇస్తామని తెలిపారు.

ఘనంగా పీఎస్సార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసిపి నేత, పారిశ్రామిక వేత్త పొనకా శివకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, పీఎస్సార్ సంస్థల ఉద్యోగులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛఆంధ్ర ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మతో కలిసి శివకుమార్ రెడ్డి కేక్ కట్ చేశారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు, నాయకులు, ఉద్యోగులు పూల బొకేలు అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి వారందరికీ శివకుమార్ రెడ్డి కేక్‌ను అందించారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోదండ రామయ్య, గోపాల్ యాదవ్, శాంతి, సురేష్ రెడ్డి, చిన్నా, ముని, సాయి, హాషిమ్, ఇమ్రాన్, కబీర్, వాసుదేవ రాజుతో పాటు శివాబి కేబుల్ ఆపరేటర్లు కాళపరెడ్డి, చల్లా శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. దగ్గోలు మల్లికార్జున రెడ్డి వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు దగ్గోలు కిషోర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలన్నారు. కార్యక్రమంలో, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ రావు, రాము, కుమార్‌నాయుడు, శీను, రమేష్, పోతిరెడ్డి పెంచలయ్య, మునిప్రసాద్, నాగరాజు, కార్యనిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.

ఆటిజం నయం చేసుకోవచ్చు: డాక్టర్ శిరీష

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఆటిజం వ్యాధిని అవగాహనతో జబ్బు నయం చేసుకోవచ్చునని జిల్లా ఆర్‌బిఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష అన్నారు. మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని డిఈఐసి సెంటర్‌లో "ప్రపంచ ఆటిజం దినోత్సవం" సందర్భంగా మాట్లాడుతూ ఆటిజం అనే వ్యాధిని తెరపి చికిత్సలు, అవగాహనతో తగ్గించే అవకాశం ఉందన్నారు. ఈ జబ్బుతో బాధపడుతున్న చిన్నారులకు జిల్లా డిఈఐసి సెంటర్‌లో మల్టిపుల్ థెరపీ ద్వారా చికిత్స, కౌన్సిలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం వ్యాధికి సంబంధించి పలు అంశాలపై వివరించారు.

ఓటు వేయండి.. మహిళా శక్తిని చాటండి

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న నగర పాలక సంస్థ సిబ్బంది

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకొని మహిళా శక్తిని చాటాలని నగరపాలక స్వీప్ నోడల్ టీం సభ్యులు పిలుపునిచ్చారు. నగరపాలక స్వీప్ నోడల్ టీం మంగళవారం మురుకంబట్టు, ఎల్.బి.పురం పోలింగ్ స్టేషన్ల పరిధిలోని మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమస్యాత్మక, గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నమోదు శాతం పెంచడంలో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. మహిళలు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటింగ్ విధానం, ఈవీఎంల వినియోగం, వీవీప్యాట్ ఉపయోగం తదితర అంశాలతో కూడిన కరపత్రాలను మహిళలకు పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు పోలింగ్ రోజున ఓటు వేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంహెచ్‌వో, స్వీప్ అసిస్టెంట్ నోడల్ అధికారి చిన్నయ్య, స్వీప్ నోడల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

గుడిపాలలో గురజాల ప్రచారం



ంప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రజలంతా ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ కోరారు. మంగళవారం గుడిపాల మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఓటేసి గెలిపిస్తే చిత్తూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. ఒక అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

మంగళవారం నగరంలోని 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సుబ్బరాయుడు కోడలు దేవి ఆధ్వర్యంలో వారి అనుచరులు గురజాల జగన్మోహన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కుసుమ, సంగీత, గోవిందమ్మ, శ్యామల, కమల, సంపూర్ణ, శాంతి, కమలమ్మ, వసంత, గీత, అమ్ములు, కస్తూరి తదితరులు భారీ సంఖ్యలో ఉన్నారు.

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలో గల జాలరిపల్లి, ఇల్లూరులలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటామని స్పష్టం చేశారు.

7న పాకాలలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి -పాకాల: ఈ నెల 7వ తేదీ పాకాలలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ చెస్ టోర్నమెంట్ పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ చెస్ ద్వారా విద్యార్థులు శక్తివంతులు అవుతారన్నారు. పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు మాట్లాడుతూ తిరుపతి చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సహాయ సహకారాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌ను ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు పాకాల ప్రభుత్వ హైస్కూలులో ప్రారంభిస్తు న్నామన్నారు. అన్ని వయసుల చెస్ క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన వచ్చని తెలిపారు. మొత్తం 50 వేల రూపాయల నగదు బహుమతులు వుంటాయని, వివిధ కేటగిరీలలో 52 మంది విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్స్, మరో 20 మంది విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందించనున్నామని తెలిపారు. దీంతో పాటు క్రీడాకారులకు ఉచిత భోజన ఏర్పాట్లు చేస్తున్నామని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లను 'ఎపిచెస్.వొఆర్‌జి లింకు' ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు, నిర్వాహకులు విజయబాబు 8143337722, మహేష్ బాబు 9701401492 ఫోన్ నెంబర్లను సంప్రదించా లన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక దంత వైద్యశాల డాక్టర్ భువీందర్, బాలు పాల్గొన్నారు.

93 మంది ఫార్మసీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ప్రాంగణ నియామకాలలో 93 మంది సెవెన్ హిల్స్ ఫార్మసీ విద్యార్థులు అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు తెలిపారు. మండలంలోని వెంకట్రామాపురం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో అపోలో ఫార్మసీ కంపెనీ ప్రతినిధులు దుర్గాప్రసాద్, జగదీష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుండి 123 మంది విద్యార్థులు హాజరయ్యారు. నియామకపు ప్రక్రియలో భాగంగా విద్యార్థు లకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి, అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపి క చేశామని అపోలో ఫార్మసీ సంస్థ ప్రతినిధులు దుర్గా ప్రసాద్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థు లకు సంవత్సరానికి 2లక్ష ల 40వేల రూపాయ లు వేత నంగా నిర్ణయిస్తూ నియామక పత్రాలు అందిం చారు. ఈ సందర్భం గా ప్రాంగణ నియామకాలలో ఎంపికైన సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులను కరస్పాండెంట్ ఎం సుమలత, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

చెరువులో పడి ఇద్దరు విద్యార్థుల మృతి

ఆకాష్

సంజయ్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఇద్దరు విద్యార్థులు చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్‌పేట గ్రామం పచ్చనపల్లికి చెందిన సంజయ్, ఆకాష్‌లు ఇటీవలే పదో తరగతి పరీక్షలు పూర్తి చేశారు. కాగా మంగళవారం మధ్యాహ్నం ఈత కోసం సమీపంలోని కృష్ణాపురం చెరువులో దిగారు. ఈత రాకపోవడంతో మునిగిపోయారు. గుర్తించిన స్థానికులు అప్రమత్తమై వారిని 108లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సంజయ్, ఆకాష్‌లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకొని కుమారుల మృతదేహాలను చూసి కన్నీటీపర్యంతమైయ్యారు.